ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

తెలుగు కవులపై జాషువా ప్రభావం

డా.ఎల్. శ్రీనివాస్

పరిశోధక విద్యార్థి ,ఉస్మానియా విశ్వవిద్యాలయం,హైదరాబాద్.

Article Received: 05/09/2026

Article Accepted: 16/10/2026

Published Online: 17/10/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3.4.20

నేపథ్యం: జాషువా సాహిత్యం మీద 20వ శతాబ్దంలో వచ్చిన ఉద్యమాలు, రాజకీయ, సాంఘిక, ఆర్థిక ,సామాజిక స్థితిగతులు ప్రభావం చూపాయి. వీటిని ఆకలింపు చేసుకున్న జాషువా సమాజంలో అసమానతలను తొలగించి మానవ సమాజం సౌభాగ్యవంతంగానూ, సుఖశాంతులతోనూ జీవించాలని ఆకాంక్షించాడు. దాని కొరకు కవిత్వాన్ని రచించాడు. పద్య కవిత్వంలో ఆధునికతను ప్రదర్శించాడు. పద్యానికి పదును పెట్టి సామాజిక ప్రయోజనం కోసం సాధనంగా వాడుకున్నాడు. సమసమాజ భావజాలానికి సన్నిహితంగా ఆయన సాహిత్యం ఉంటుంది.

మారుతున్న కవిత్వానికి, మారుతున్న విలువలకు అనుగుణంగా జాషువా కవిత్వ రూపంలోని అభివ్యక్తి కూడా మారింది. కాలం మారేటప్పుడు సమకాలీన సమాజంలో జీవించే కవి మార్పును ఆహ్వానించాలి. పాత విలువలకు కొత్త ఆలోచనలు జత చేసి సరికొత్త మార్గాన్ని నిర్దేశించాలి. జాషువా సరిగ్గా ఆ పనే చేశాడు. జాషువాలో ఆర్ద్రత, అపారమైన భావుకత కలగల్సిన మానవీయ దృక్పథం ఉంటుంది. జాషువా ఎంచుకున్న వస్తువు, తన స్వతంత్ర శైలి, శిల్ప నైపుణ్యం, భాషా ప్రయోగాలు, సమాజంలో స్వయంగా అనుభవించిన అవమానాలకు అక్షర రూపం ఇచ్చి సమాజ హృదయాన్ని కదిలించిన వైతాళికుడు కావడం వలననే సమకాలీన కవులకు, తరువాతి తరం కవుల రచనలపై ప్రభావాన్ని చూయించగలిగాడు.

ఇతర కవులపై జాషువా ప్రభావం:

"పద్య రచన జాషువా వలన తమకు సంక్రమించిందని"కూడా కొందరు కవులు స్వయంగా పేర్కొన్నట్లు రసరాజు రచించిన ' మధుర శ్రీనాథుడు జాషువా' అనే సంకలనం నుండి ఎండ్లూరి సుధాకర్ ఆధారాలను చూపెట్టారు. సాహిత్యంలో ప్రభావం అన్న పదం చాలా విలువైనది. ఈ ప్రభావాన్ని ఐదు రకాలుగా విభజించారు ఎండ్లూరి సుధాకర్.1. వస్తు ప్రభావం 2. శైలి ప్రభావం 3.రూప ప్రభావం 4. శిల్ప ప్రభావం

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

5.భావ ప్రభావం. అయితే ప్రభావితమైన కవి తన సొంత నైపుణ్యం చూపించాలి. లేనిచో మూల ప్రభావం కనిపిస్తుంది. రామరాజభూషణుడు రచించిన వసు చరిత్ర ప్రభావంతో ఎన్నో పిల్ల వసు చరిత్రలు వచ్చాయి. అవి కనుమరుగు కూడా అయిపోయాయి. కాని రామరాజభూషణుడి వసుచరిత్ర మాత్రం నిలిచింది. ఇతర కవుల ప్రభావానికి గురైన కవులకు సొంత సాహిత్య నైపుణ్య శక్తి ఉండాలి. మహాకవుల ప్రభావం సర్వకాలాల్లోనూ, సమకాలిక కవులపై ప్రసరించడం సాహిత్యంలో చారిత్రక వాస్తవము. "పద్యాన్ని రచనా ప్రక్రియగా తీసుకొని సామాన్యుని కథానాయకుడిని చేసి, మనిషి కోసం తన రచనా వ్యాసాంగాన్ని కొనసాగించిన గొప్ప కవి జాషువా".1

దాశరథిపై జాషువా ప్రభావం:

ఎండ్లూరి సుధాకర్ దాశరథి సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. జాషువా రచించిన శిల్పి ఖండికలో ' శిల్ప కంఠీరవా' , ' శిల్ప విద్యానిధి' అని కళాత్మకంగా సంబోధిస్తే, దాశరథి తన శిల్పి ఖండికలో ఇదే పద్ధతి అనుకరిస్తూ 'శిల్పి కులావతంసమా ', శిల్పి కుల కుంజర' అని అచ్చం జాషువా లాగే సంబోధించాడు. అలాగే గబ్బిలం కావ్యంలో జాషువా గబ్బిలాన్ని ' పక్షిణి , గబ్బిలపుచానా, పతంగీ, మౌని ఖగరాజ్ఞి ' అని వైవిధ్యంగా సంబోధనలు ప్రయోగిస్తే ఇదే శైలిలో దాశరథి తన మహాంధ్రోదయం కావ్యంలో 'కపోతి సందేశం' అనే ఖండికలో పావురాన్ని వర్ణిస్తూ ,' పతగీ, పక్షిణి, పులుగుచానా, పక్షిరాజ్ఞి ' అనే ప్రయోగాలు చేశాడు. జాషువాను అనుసరించి చాలా ప్రయోగాలు దాశరథి పద్యాల్లో కనిపిస్తాయని ఎండ్లూరి సుధాకర్ ఉదాహరణలతో నిరూపించారు.

కరుణ శ్రీ పై జాషువా ప్రభావం

కరుణశ్రీ అనే కలం పేరుతో ప్రసిద్ధమైన కవి జంధ్యాల పాపయ్య శాస్త్రి. పాపయ్య శాస్త్రి తెలుగు సాహిత్యంలో లబ్ధ ప్రతిష్ట కవిగా పేరుపొందాడు. జాషువా కవిగా ఉన్నత స్థాయిలో వెలుగొందుతున్నప్పుడు కరుణశ్రీ వర్ధమాన కవిగా ఉన్నాడు. విరిద్దరి రచనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఎండ్లూరి సుధాకర్ జాషువా యొక్క కవిత్వంలో కనిపించే కొన్ని ప్రత్యేక లక్షణాలు కరుణశ్రీ సాహిత్యంలో ఉన్నాయని, ముఖ్యంగా వస్తువు, శైలిలో జాషువా ప్రభావం కరుణశ్రీ పై ఉందని తెలియజేశారు.

ఖండ కావ్య ప్రక్రియ జాషువా ద్వారా విస్తృతమైన ప్రచారం పొందింది. కరుణశ్రీ రచించిన ' ఉదయశ్రీ' ఖండకావ్య సంపుటికి జాషువా కవిత్వం ఆదర్శంగా ఉందని, కరుణశ్రీ కథలతో కూడిన మహాకావ్యాలను రచించకుండా, జాషువా లాగానే ఖండ కావ్య రచనలు చేశాడని ఎండ్లూరి తెలియజేశారు. కరుణశ్రీ రచించిన ' పాకి పిల్ల, బీద పూజ, పుష్పవిలాపం, కుంతి కుమారి' మొదలైన ప్రసిద్ధ ఖండికలకు జాషువా ఆదర్శమని

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

తెలియజేశారు. తెలుగు సాహిత్యంలో జాషువా తర్వాత కరుణశ్రీ రచించిన ఖండకావ్యాలే ఎక్కువ ప్రచారాన్ని , ప్రఖ్యాతిని పొందాయి.

జాషువా యొక్క ప్రభావం కరుణశ్రీ పై 1. వస్తు ప్రభావం 2.రూప ప్రభావంగా రెండు రూపాలలో ఉందని, ఒక్కోసారి వస్తువు - రూపం మిళితమైన కవిత్వ సందర్భాలు కూడా ఉన్నాయని ఎండ్లూరి తెలియజేశారు. ఉదాహరణకు జాషువా రచించిన ఫిరదౌసి కావ్యంలో "పొటమరింపక ముందే పుష్పసంతతులకు / వింతగా రంగులు వేయువాడ" అని సీస పద్యంలో భగవంతుని యొక్క శక్తి సామర్థ్యాలను జాషువా కొనియాడాడు.అదే రూపంలో కరుణశ్రీ సీస పద్యంలో ఉదయశ్రీ కావ్యంలో "తెలవారకుండా మొగ్గలలోన జొరబడి / వింత వింతల రంగు వేసి వేసి" అనే పద్యం జాషువా మూల పద్యానికి చాలా సన్నిహితంగా ఉంది.

భావకవితా యుగంలో ఆంధ్ర ప్రశస్తి, ఆంధ్ర పౌరుషం, దేశభక్తి అనే అంశాల గురించి ఎక్కువ కావ్య ఖండికలు రచించబడ్డాయి. జాషువా ఆంధ్రదేశం యొక్క వైభవాన్ని, ఆంధ్ర రాజుల కళా పోషణను, ఆంధ్రత్వాన్ని గురించి గొప్పగా కవిత్వ రచన చేశాడు. జాషువా యొక్క దేశభక్తికి, సంప్రదాయ అభిమానానికి ' ఆంధ్రుడు' అనే పేరుగల ఖండిక విశేష ప్రఖ్యాతి పొందింది. "బహుదేశములను బేర్వడసి మీసము దీటు/ భరతఖండంబు నా పాఠశాల " అంటూ ఆంధ్రుని, తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తే "సర్వ భూమి పూజ్య గిర్వాణ భాషామ /తల్లి గారాబంపు తల్లి నాకు /అత్యంత సుకుమారి ఆంధ్ర భాషా యోష/అల్లారు ముద్దుల చెల్లి నాకు" అని ఉదయశ్రీ కావ్యంలో కరుణశ్రీ చెప్పాడు.

జాషువా రచించిన ' ఆంధ్రుడను' అనే ఖండికలో "శ్రీకృష్ణరాయ ధాత్రి నాయకుని సమ / గ్ర ప్రతాపము, దీపక కలిక మాకు/ రాజరాజ నరేంద్ర రమణీయ సద్యశ/ కాండంబు, పండు రేయేండ మాకు" అని రచిస్తే, దీనిని అనుసరించి కరుణశ్రీ "కాళిదాస కవీంద్ర కావ్య కళా వీధి /పరుగులెత్తెడి రాచ బాట నాకు/ భట్టబాణుని ముద్దు పట్టి కాదంబరి/ కథలు చెప్పేడి చెల్మి కత్తెనాకు" అని రచించాడు. ఈ విధంగా జాషువా , కరుణశ్రీని తులనాత్మక దృష్టితో చూసిన ఎండ్లూరి సుధాకర్ కరుణశ్రీ పై ఉన్న జాషువా ప్రభావాన్ని ఉదాహరణలతో సహా తెలియజేశాడు.

వినుకొండ కవులపై జాషువా ప్రభావం: జాషువా ఈ ప్రాంత వాసి కావడంతో పాటు 1920 లో బైబిల్లో ఉన్న మహా భక్తుడు, వాగ్గేయకారుడైన దావీదు కథను ' దావీదు చరిత్ర' అనే పేరుతో నాటకంగా రాశాడు. 1921లో క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని వస్తువుగా తీసుకొని ' చిదానంద ప్రభాతము' అనే పేరుతో నాటకం రాశాడు. ఈ నాటకమే పౌరాణిక నాటక లక్షణాలున్న తొలి క్రైస్తవ తెలుగు నాటకంగా నిర్ధారించవచ్చని

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

ఎండ్లూరి సుధాకర్ పేర్కొన్నారు. ఈ ప్రభావంతో బైబిల్ లోని అంశాలను నాటకాలుగా, కావ్యాలుగా రాయాలన్న ఆలోచన నాటి క్రైస్తవ కవులకు కలిగింది. ఈ పరిణామాలకు ప్రధాన కారకుడు జాషువానే. జాషువా ప్రభావంతో బీర్ని డిమోషే రచించిన ' యోహాను చరిత్ర', మురారి దానియేలు రచించిన క్రీస్తు జననం, మందపాటి అబ్రహం రచించిన క్రైస్తవ దాత్పర్యం, కొర్రపాటి జేమ్స్ రచించిన శిలువదారి, జొన్నకూటి దానియల్ రచించిన క్రీస్తు జయంతి, బల్లి పురుషోత్తం యొక్క ఎస్తేరు నాటకం, ప్రసన్న రచించిన క్రీస్తు పుట్టుక, ఎడ్లపల్లి సామేలు కవి రచించిన క్రీస్తు మహిమ, నూతక్కి అబ్రహం రచించిన పాపక్షమ, పిడపర్తి ఎజ్రా రచించిన యేసు క్రీస్తు, జ్ఞానానందకవి యొక్క క్రీస్తు ప్రబంధం, తరంగ మాల, విద్వాన్ బి. ఏలియా రచించిన సచిత్ర క్రీస్తు చరిత్ర, క్రీస్తు ఖండకావ్యాలు, ఎంపీ జాన్ రచించిన కన్నీటి గాధ ,వి. రగయల్ రచించిన శ్రీ క్రీస్తు రాజ్య శతకము మొదలైన రచనలు పరోక్షంగా నైనా, ప్రత్యక్షంగా నైనా జాషువా ప్రభావంలోనే వెలువడ్డాయని ఎండ్లూరి సుధాకర్ తన పరిశోధనలో తెలియజేశారు.

వినుకొండకు చెందిన బీర్నిడి విజయదత్తు రచించిన ' స్వర్గావతారణ' మనే కావ్యంలో జాషువా కవిత్వ పోకడలను ఉదాహరణలతో సహా ఎండ్లూరి సుధాకర్ పేర్కొన్నారు.1932 మే నెలలో భారతి పత్రికలో ప్రచురితమైన ' జేబున్నిసా' ఖండికలోని జాషువా పద్యాన్ని విజయదత్తు తన స్వర్గావతరణ (1954) అనే కావ్యం లో ఎంత దగ్గరగా అనుకరించాడో తులనాత్మకంగా ఎండ్లూరి తెలియజేశారు. "మొగలు రాజన్యుని పగడాల మేడలో/ వసింపదింక నీ ప్రణయ లక్ష్మి/ ఢిల్లి నవాబుల మల్లె తోటల వంక/ బరికింపదింక నీ వలపు జిలుక/ ఔరంగజేబుని యపరంజి గిన్నెలో / భుజింపదింక నీ ముద్దులాడి/ పాదుషా నగరిలో బట్టు పాన్పుల మీద/ బవళింపుదింక నీ పాద దాసి"అని జాషువా రచించాడు. దీనిని అనుసరించి "పలికింపబడి రోజు పచ్చిక బయలున/ దావిదు రాజు రత్నాల వీణ/ ప్రసరింపదీనాడు శిబిరాన/ రసపిపాసుల ఒయారముల పాట/ సవరింపడీ పూట జంషీదు కొలువలో/ పరదేశి పసిడి కిన్నెరుల మ్రోత/ కదలింపది ఖై కుసురు మేడలో/ కన్నె భోగముసాని కాలిగజ్జె" అని విజయ దత్తు రచించాడు. ఈ రెండు పద్యాలను పరిశీలిస్తే జాషువా ప్రభావం విజయదత్తుపై సంపూర్ణంగా ఉందని గ్రహించవచ్చు.

ముగింపు:

ప్రతిభావంతులైన కవుల యొక్క ప్రయోగాలు గాని, వాడిన పదబంధాలుగాని, శైలి విశేషాలు గాని, రచన ప్రక్రియలు గాని, చమత్కారాలు గాని, వస్తువు గాని సమకాలిన కవుల పైన లేదా తర్వాతి తరం కవుల మీద ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. జాషువా యొక్క ప్రభావం ఎంతవరకు ప్రసరించిందంటే కొందరు కవులు

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

తమను తాము జూనియర్ జాషువాలుగా, అభినవ జాషువాలుగా, జాషువాకు వారసులుగా బిరుదులను తగిలించుకోవడం వరకు వెళ్ళింది. కొందరు వర్ధమాన కవులు జాషువా ప్రభావానికి గురైనప్పటికీ ఆ తర్వాత స్వతంత్ర కవులుగా నిలదొక్కుకున్నారు. కొందరు జాషువా అనుసరించిన కవిత్వపు జీవనాడిని పట్టుకోలేక పోయారని, 20 శతాబ్దంలోని పద్య కవులు ఎవరూ కూడా జాషువా ప్రభావం నుంచి తప్పించుకు పోలేదని చెప్పడంలో అతిశయోక్తి లేదని ఎండ్లూరి సుధాకర్ గారు తన పరిశోధనలో పేర్కొన్నారు.

ఉపయుక్త గ్రంథ సూచి:

కాలువ మల్లయ్య -జాతీయ కవి జాషువా -తెలుగు అకాడమీ ప్రచురణ-2013
ఎండ్లూరి సుధాకర్-జాషువా సాహిత్యం - దృక్పథం- పరిణామం, మానస మనోజ్ఞ ప్రచురణలు- 2007.